క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలి



పొన్నూరు: సమాజంలో పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు అన్నారు. ఆదివారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. వివేకా స్కూలు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభకు సమితి అధ్యక్షురాలు కొల్లి మాధవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా కమిషనర్ పాల్గొని పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, స్కూల్ డైరెక్టర్ ఉప్పాల సుకుమార్, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు బోడిపాటి రామారావు, రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్. రవి రాకేష్ దేవ్, ఎస్. బాలకృష్ణ పాల్గొన్నారు.

మన దేశం- మన రాజ్యాంగం పుస్తకావిష్కరణ

పొన్నూరు: కవి డాక్టర్ కత్తి పద్మారావు రచించిన 91వ పుస్తకం మన దేశం మన రాజ్యాంగం పుస్తకాన్ని అంబేడ్కర్ వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని బుక్ ఫెయిర్‌లో తోపుడు బండి సాదిక్ వేదికపై లోకాయత పబ్లికేషన్స్ ఉప సంచాలకులు కత్తి చేతన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన సభలో పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మొదటి పుస్తకాన్ని మాజీ బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు స్వీకరించారు. కార్యక్రమానికి కవి కోయి కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సభలో డాక్టర్ రియాజ్, డాక్టర్ పసునూరి రవీందర్, డాక్టర్ యాకూబ్, డాక్టర్ ఏకే ప్రభాకర్, డాక్టర్. ఖాజా పాల్గొన్నారు.

వేజండ్లలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



వేజండ్ల(చేబ్రోలు): గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. సుమారు 65 వయస్సు కలిగిన వ్యక్తి గ్రామంలోని బొమ్మగుంట సెంటర్ ప్రాంతంలో రోడ్డు పక్కన మృతి చెందిపడి ఉన్నాడు. గత కొంతకాలంగా గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో బిక్షాటన ద్వారా జీవిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. మృతదేహాన్ని గుంటూరులోని రుద్ర చారిటబుల్ ట్రస్టు వారికి అంత్యక్రియల కోసం అందజేశారు. రెవెన్యూ సిబ్బంది ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా ఉండాలి



గుంటూరురూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా ఉండాలని నగర కమిషనర్ పి.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం రాత్రి పొత్తూరు, చౌడవరం, జూనం చుండూరు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించారు. వీధిలైట్లు, పారిశుద్ధ్యం పనులను పరిశీలించారు. గతంలో వీధి లైట్ల సమస్యలపై ఆయా గ్రామాల ప్రజలు చేసిన ఫిర్యాదుల మేరకు పర్యటించి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాల జారీ చేశారు. స్థానికులను కలిసి పారిశుద్ధ్యం, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు వీధి దీపాలు, రోడ్లు, సైడ్ డ్రెయిన్స్ తదితర అంశాలను కమిషనర్‌కు వివరించారు. వీటినంత త్వరగా సమస్యలను పరిష్కారిస్తామని కమిషనర్ ప్రజలు హామీ ఇచ్చారు.

బీజేపీ గుంటూరు రూరల్ మండల అధ్యక్షుడిగా రాజేష్

గుంటూరు మెడికల్: బీజేపీ గుంటూరు రూరల్ మండలం అధ్యక్షుడిగా గోరంట్లకు చెందిన కంచర్ల రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం బ్రాడీపేటలోని బీజేపీ కార్యాలయంలో రూరల్ మండల అధ్యక్షుడి ఎన్నికలు జిల్లా జనరల్ సెక్రటరీ వై.వి. సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్ష స్థానం కోసం కంచర్ల రాజేష్ నామినేషన్‌ను గుండా కోటేశ్వరరావు ప్రతిపాదించగా, వి.పాండురంగవిఠల్ బలపరిచారు. ఈ ఎన్నికకు ఏకైక నామినేషన్ రావడం వలన ఎన్నిక ఏకగ్రీవమైనట్లు మండల రిటర్నింగ్ అధికారి శోభన్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.పాండురంగ విఠల్, రాష్ట్ర ఈసీ సభ్యులు పరాంకుశం శ్రీనివాసరావు, జిల్లా సహాయ ఎన్నికల అధికారి టీవీ కృష్ణారెడ్డి, మండల ఎన్నికల అధికారి తోట శ్రీనివాసరావు, అనుములు ఏడుకొండలు, పి.జగదీష్ శర్మ, మద్ది బాలాజీ, అన్నపూర్ణమ్మ పాల్గొని నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు రాజేష్‌ను సన్మానించారు.

ఆహ్లాదం.. ఎంతెంత దూరం..

- అధ్వానంగా పార్కులు
- మందుబాబులకు అడ్డాగా..
- విరిగిన సిమెంట్ బల్లలు.. పిల్లల ఆట వస్తువులు
- ఎటుచూసినా మద్యం బాటిళ్లు, చెత్త, వ్యర్థాలే ..
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



అధ్వానంగా ఉన్న పార్కు పరిసరాలు

పొన్నూరు: ప్రజలు సేద తీరడానికి ఏర్పాటు చేసిన పార్కులు అభివృద్ధి జాడలేక శిథిలావస్థకు చేరాయి. పార్కులలో ఎటు చూసినా విరిగిన సిమెంటు బల్లలు, పిల్లల ఆట వస్తువులు దర్శనమిస్తున్నాయి. పలు పార్కులు మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. పట్టణ ప్రగతికి మున్సిపల్ శాఖ రూ.కోట్లు వెచ్చిస్తున్నా, పార్కుల అభివృద్ధి మాత్రం అధికారులకు పట్టడంలేదు. పట్టణంలోని 19, 23, 6వ వార్డులోని మున్సిపల్ పార్కులున్నాయి.. ప్రజలకు ఆహ్లాదం కలిగించేందుకు విలువైన స్థలాలను పార్కులకు కేటాయించారు. రూ.కోట్లు వెచ్చించి పార్కులుగా తీర్చిదిద్దారు.. నేడు ఆ పార్కులు ఆదరణ కోల్పోయి అధ్వానంగా మారాయి. ప్రధానంగా శాంతినగర్ పార్కులో మట్టి కుప్పలు, చెత్త, వ్యర్థాలతో అధ్వానంగా ఉన్న పరిసరాలు, తాగిపడేసిన మద్యం బాటిళ్లు, విరిగిన బల్లలు, పిల్లల ఆట వస్తువులు దర్శనమిస్తున్నాయి. పార్కు పరిసరాల్లో కంపచెట్లు పెరగడంతో పాములు సంచరిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. అన్ని వేళల్లో మందుబాబులు మద్యం తాగేందుకు అడ్డాగా మలుచుకుంటున్నారని చెబుతున్నారు. బల్లలు విరిగి పోవడంతో కూర్చునేందుకు వీలు లేకుండా ఉన్నాయి. సరైన సౌకర్యాలు లేనికారణంగా పార్కుకు వచ్చే వారి సంఖ్య క్రమేపి తగ్గు ముఖం పట్టింది. వానొస్తే వర్షం నీరు బయటికి వెళ్లే మార్గం లేక నెలల తరబడి నిల్వ ఉంటుంది. వివిధ పన్నుల రూపంలో మున్సిపాలిటికీ ఆదాయ వనరులు సమకూరుతున్నా ప్రజలకు కావలసిన సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రారంభ దశలో జరిగిన అభివృద్దే తప్ప..



పార్కులో పడేసిన మద్యం సీసాలు

ఏళ్లు గడుస్తున్నా పార్కు అభివృద్ధి పట్టడంలేదు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో కొరవడిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కు అభివృద్ధి చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా ప్రయోజనం శూన్యం

శాంతినగర్ పార్కును అభివృద్ధి చేయడంలో అధికారులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారు. మందుబాబులకు అడ్డాగా మారింది. అక్కడే తాగి సీసాలు పడేస్తున్నారు. ఏళ్ల తరబడి పార్కును పట్టించుకున్న దాఖలాలు లేవు. సరైన సౌకర్యాలు లేక పార్కుకు ఎవరూ రావడం లేదు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇప్పటికైనా సౌకర్యాలు మెరుగు పరచాల్సిన అవసరం ఉంది.

–రమాదేవి, స్థానికురాలు





విరిగిన బల్లలు, ఆట వస్తువులు

నేడు రేషన్ డీలర్ల దరఖాస్తుకు తుది గడువు

పొన్నూరు: నియోజకవర్గం పరిధిలో వివిధ కారణాలతో ఖాళీ అయిన చేబ్రోలు 9, పొన్నూరు పట్టణం 2, మండల పరిధిలో 3 చౌకధరల దుకాణాల డీలర్ పోస్టులకు శాశ్వత ప్రాతిపదికన భర్తీకి ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ గడువు ఈ నెల 30వ తేదీతో ముగియనుంది. చేబ్రోలు మండలంలో నారాకోడూరు, చేబ్రోలు 2, కొత్తరెడ్డిపాలెం, శలపాడు, శ్రీరంగపురం, గొడవర్రు, వేజెండ్ల, పాతరెడ్డిపాలెం, పొన్నూరు మండలంలో మునిపల్లె, మాచవరం, వెల్లలూరు, పట్టణంలో రెండు దుకాణాలకు అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

■ దరఖాస్తుదారుల ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించి, 18 నుంచి 40 సంవత్సరాల వయసు కలిగి ఉండాలి. నిరుద్యోగ అభ్యర్థుల నుంచి ఆయా డిపోల రిజర్వేషన్ ప్రాతిపదికన దరఖాస్తులు పరిశీలించనున్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా పోస్టులను భర్తీ చేయనున్నారు. 30న సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించిన అర్జీలకు జనవరి 5న తెనాలి పట్టణంలో నిర్ణయించిన ప్రదేశంలో ఉదయం 9.30 గంటల నుంచి 2 గంటల పాటు రాత పరీక్ష ఉంటుంది. ఒరిజినల్ ఆధార్ కార్డు తీసుకొని గంట ముందు పరీక్షా కేంద్రంలో హాజరుకావాలి. రాత పరీక్షలో ఎక్కువ మార్కులు వచ్చి అభ్యర్థుల వివరాలు తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో నోటీస్ బోర్డు ప్రకటిస్తారని తహసీల్దార్ జియావుల్‌హక్ తెలిపారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులు 6న ఉదయం 10 గంటలకు తెనాలి కార్యాలయంలో నిర్వహించనున్న ఇంటర్వ్యూలో ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాల్గొనాలని అన్నారు. తమ విద్యార్హతలు, వయసు, కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాలతో పాటు రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలను అర్జీతో పాటు జతపరచాలన్నారు.

గౌతు లచ్చన్న విగ్రహానికి క్షీరాభిషేకం



సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ సంఘం నాయకులు

నెహ్రూ నగర్: గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని రాజకీయాలతో ముడిపెట్టి అవమానించడం సిగ్గుచేటు అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర రావు పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీన నూజివీడులో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహ ఆవిష్కరణ తరువాత కుల అహంకరులు కార్యక్రమాన్ని అవమానపరిచడాన్ని నిరసిస్తూ ఆదివారం బస్టాండ్ వద్ద గల గౌతు లచ్చన్న విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడులో జరిగిన గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం పార్టీలకతీతంగా జరిగిందన్నారు. విగ్రహావిష్కరణ తర్వాత తర్వాత బీసీల ఐక్యత చూడలేని కులాధిపత్య శక్తులు సోషల్ మీడియా వేదికగా బీసీలపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడమే తప్పు అన్నట్లుగా ప్రచారం చేయటం బాధాకరమన్నారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు కుమ్మర క్రాంతికుమార్, హైకోర్టు న్యాయవాది వై.కోటేశ్వరరావు, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

బృహత్తర చండీయాగం ప్రారంభం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో ఆదివారం బృహత్తర చండీయాగం ప్రారంభించారు. భారతీ ధార్మిక విజ్ఞాన్ పరిషత్, దేవాలయ కమిటి, 13వ స్వాముల సద్దిలో భాగంగా నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు 13 మంది వేద పండితుల ఆధ్వర్యంలో కలశ స్థాపన, శివలింగానికి మాన్యాసపూర్వక రుద్రాభిషేకం, నవగ్రహాలకు, గణపతి స్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ జరిగాయి. శ్రీలక్ష్మీ గణపతి, రుద్ర, చండీ హోమాలు, చండీ, లలితా సహస్రనామ సామూహిక పారాయణాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్లేపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ వచ్చే నెల 13 వరకు చండీ యాగం కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు

లక్ష్మీపురం: అవుట్ సోర్సింగ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.2.20 లక్షలు నగదు తీసుకుని ఉద్యోగం ఇప్పించక పోగా అడిగినందుకు బెదిరింపులకు దిగిన వ్యక్తి పై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మారుతీనగర్ 5వ లైన్ ప్రాంతానికి చెందిన పొట్లూరి వెంకటకృష్ణ పదో తరగతి పూర్తి చేసుకుని మినరల్ వాటర్ కంపెనీలో సర్వీసింగ్ చేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన బూడిద చరణ్ అనే వ్యక్తి పరిచయమై వెంకటకృష్ణకు అవుట్ సోర్సింగ్‌లో ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. ఉద్యోగానికి రూ.2.20 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పడంతో వెంకటకృష్ణ మార్చి 20వ తేదీన ఫోన్ పే ద్వారా చరణ్ బ్యాంక్ ఖాతాకు రూ.2.20 లక్షల నగదును పంపించాడు. నగదు పంపించినప్పటి నుంచి ఉద్యోగం గురించి అడుతుంటే కాలయాపన చేస్తున్నాడు. దీంతో బాధితుడు చరణ్ వద్దకు వెళ్లి నగదు అయిన వాపసు చేయాల్సిందిగా కోరడంతో చరణ్ బాధితుడిని బెదరింపులకు దిగాడు. దీంతో దిక్కు తోచక బాధితుడు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలకు.. పోలీసు నంబర్

'ఇటీవల యువకుడి ద్విచక్ర వాహనాన్ని అతి వేగంతో హిందూ కళాశాల కూడలిలో ఆటో ఢీకొట్టింది. గాయపడిన ఆ యువకుడు ఆటో నంబర్ గుర్తు పెట్టుకున్నా.. ముందు ఉన్న అక్షరాల్లో తేడా రావటంతో పట్టుకోలేకపోయారు.' ఇలాంటి నేరాల నియంత్రణకు పోలీసులు నడుంబిగించారు. అందులో భాగంగా ఆటోలకు ట్రాఫిక్ పోలీసులు నంబర్‌లు కేటాయిస్తున్నారు.



ఆటోలకు ట్రాఫిక్ పోలీసులు కేటాయించిన నంబర్‌లు పరిశీలిస్తున్న సీఐ అశోక్

పట్నంబజారు: నిత్యం ఆటోలతో జరుగుతున్న ప్రమాదాలు, నేరాల నియంత్రణకు పోలీసు శాఖ దృష్టి సారించింది. దానిలో భాగంగా ఇటీవల కాలంలోనే జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పోలీసు కల్యాణ మండపంలో ఆటో యూనియన్ నేతలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, ఆటోలకు ట్రాఫిక్ పోలీసులు కేటాయించే నంబర్ తప్పని సరి అని, ఇకపై ప్రతి ఆటోకు ఉండాలని దిశా నిర్దేశం చేశారు. దానిలో భాగంగా నూతన సంవత్సరం జనవరి 2 లేదా 3 తేదీల్లోగా యూనియన్ నేతలు చర్చించి, ఆయా యూనియన్‌ల్లో ఎంతమందికి నంబర్‌లు ఉన్నాయి, లేని వారు ఎంత మంది అనే పూర్తి అంశాలను ఆయా ట్రాఫిక్ స్టేషన్‌లలో నమోదు చేయించాలని ఆదేశించారు. సంక్రాంతి పండుగ లోగా నంబర్లు జారీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

నగరంలో లెక్క ఇలా...

గుంటూరు నగరంలో ఆర్టీఓ, ట్రాఫిక్ పోలీసుల లెక్కల ప్రకారం సుమారు 25 వేల నుంచి 30వేల వరకు ఆటోలు తిరుగుతున్నట్లు అంచనా. కొన్నేళ్ల క్రితం ట్రాఫిక్ పోలీసులు ఆటోలకు జారీ చేసి నంబర్లు 10 నుంచి 12 వేల వరకు ఉండే అవకాశం ఉంది. అయితే ఇప్పుడు సుమారు 15 వేల ఆటోలకు నంబర్లు కేటాయించాల్సి ఉంది. ఈ క్రమంలో సంక్రాంతి నుంచి నిత్యం వంద నుంచి ఆ పైగా వాహనాలకు ట్రాఫిక్ నంబర్‌లు కేటాయించేందుకు దృష్టి సారిస్తున్నారు. దీంతో ఆటోలో ప్రయాణించే ప్రయాణికులకు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరటం, ఏదైనా ఘటనలు జరిగితే కేవలం నాలుగు నంబర్‌లు మాత్రమే ఉండే పోలీసు నంబర్ ఎంతో సులభంగా గుర్తు పెట్టుకునే అవకాశాలు ఉన్నాయి. ఈ నెంబర్‌లను ఆటో వెనుక, డ్రైవర్ వెనుక, ముందు భాగాల్లో కూడా వేయించనున్నారు.

ప్రణాళిక ప్రకారం....

ఆటోలకు ట్రాఫిక్ పోలీసులు కేటాయించే నంబర్లుకు సంబంధించి ప్రణాళికబద్ధంగా ముందుకు సాగనున్నారు. ముందుగా ఆటో యజమాని పేరు, అద్దెకు తీసుకునే వ్యక్తుల పేర్లు రాసుకుని, వాటిని ఆన్‌లైన్‌లో అనుసంధానం చేయనున్నారు. ఆటోలు ఉదయం వేళలో ఎవరి దగ్గర ఉంటుంది. కచ్చితంగా నమోదుకు సంబంధించి ఆటో సీ బుక్, డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్, పూర్తి ధ్రువీకరణ పత్రాలు పొందుపరచాల్సి ఉంది. ఈ క్రమంలో ఏదైనా ఘటన జరిగినా.. క్షణాల వ్యవధిలో ట్రాఫిక్ పోలీసు నంబర్ ఉంటే.. ఆటోను పట్టుకోవచ్చు. సంక్రాంతిలోగా వివరాలు సేకరించి, అనంతరం పోలీసు నంబర్‌లు కేటాయించే పనిలో ఉన్నారు. ఇప్పటికే ఆటోలకు నెంబర్ ఉన్న వారిని రెన్యువల్ చేయటంతో పాటు, లేని వారికి నూతన నంబర్లు కేటాయిస్తున్నారు. ట్రాఫిక్ నంబర్ లేని ఆటోలు నగరంలో తిరిగితే కచ్చితంగా సీజ్ చేసేందుకు పోలీసులు సన్నద్ధం కానున్నారు.

వ్యాధులపై అవగాహన ఉండాలి



లక్ష్మీపురం: అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆరోగ్య సదస్సు ఆదివారం నిర్వహించారు. సదస్సుకు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. కీళ్ల, కండరాల నొప్పులపై ఏర్పాటు చేసిన ఆరోగ్య సభలో సీనియర్ రుమటాలజిస్ట్ దీపిక మాట్లాడుతూ రుమటాయిడ్ ఆర్థరైటిస్ వ్యాధి ఒక్క కీళ్లకు మాత్రమే కాకుండా మన శరీరంలోని కళ్ళు, గుండె, ఊపిరితిత్తులు అన్ని అవయవాలకి వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం అవగాహన సభ్యులు డాక్టర్ దీపిక ను ఘనంగా సత్కరించారు. సమావేశానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్ గా వ్యవహరించగా అవగాహన సీనియర్ సభ్యులు కే చంద్రశేఖరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీ రామ చంద్రయ్య పాల్గొని ప్రసంగించారు.

ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిపై చర్చ

అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'బ్యాంకులకు లక్షల కోట్లు ఎగవేసే కార్పొరేట్లు– ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి' అంశంపై చర్చ ఆదివారం నిర్వహించారు. సమావేశంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడారు.

పారిశుద్ధ్య విధుల్లో ప్రత్యేక శ్రద్ధ చూపాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



ప్రజారోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూ నగర్: నగరంలో పారిశుద్ధ్య పనులపై కార్మికులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. భాగ్యనగర్, పట్టాభిపురం, ద్వారకా నగర్, గోరంట్ల, షాప్ ఎంప్లాయిస్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి ఆదివారం పర్యటించారు. పారిశుద్ధ్య పనులు, ఓసీ(ఆక్యుపెన్సీ సర్టిఫికెట్) కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు పరిశీలించి, ప్రజారోగ్య విభాగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, ఇప్పటికే నూతన కాంపాక్టర్ బిన్లు, పుష్ కాట్స్ అందించామని, వెహికల్ షెడ్‌లో పారిశుద్ధ్య పనులకు వినియోగించే వాహనాల మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టడానికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. త్వరలో ప్రతి డివిజన్‌కు ఒక ట్రాక్టర్ ఉండేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నగరంలో పారిశుద్ధ్య పనుల మెరుగుదల కోసం కృషి చేస్తుంటే కొంత మంది సిబ్బంది, అధికారులు నిర్లక్ష్య వైఖరితో ఉంటున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య మెరుగు కోసం ప్రత్యేక అధికారులు మరింత శ్రద్ధ చూపాలని, ఎంహెచ్‌ఓ, సీఎంఓహెచ్‌లు రోజు ఉదయం, మధ్యాహ్నం క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని కోరారు. పారిశుద్ధ్య పనుల్లో గతం కంటే మెరుగుదల ఉన్నా ఆశించిన స్థాయిలో రాలేదన్నారు. తమ రోజువారీ పర్యటనల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

ప్రజలు సహకరించాలి..

నగర ప్రజలు గుంటూరు నగరాన్ని సుందర, శుభ్రమైన నగరంగా తీర్చిదిద్దుకోవడానికి నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు. తమ ఇంటి ముందుకు చెత్త తీసుకోవడానికి ప్రజారోగ్య కార్మికులు రాకుంటే జీఎంసీ కాల్ సెంటర్ 0863-2345103 కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. నగరంలో బ్లాక్ స్పాట్స్ నిషేధించామని, ప్రజలు తమ ఇళ్లల్లో వ్యర్థాలు రోడ్లు, కాలువలో వేస్తే భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక బృందాల ద్వారా పర్యవేక్షణ చేయిస్తున్నామని, సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. పర్యటనలో ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, ఏసీపీలు రెహ్మాన్, మల్లికార్జున పాల్గొన్నారు.

శాంతి భద్రతలు కాపాడాలని వినతి



జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

నగరంపాలెం: జిల్లాలో సోమవారం ఏకసభ్య కమిషన్ పర్యటన దృష్ట్యా కమిషన్‌కు ఎటువంటి సంబంధం లేని సంఘాలు, నాయకులను అనుమతించవద్దని అఖిల భారత మాల సంఘాల కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ)లో ఆదివారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు కమిటీ తరఫున వినతిపత్రం అందించారు. గుంటూరు నగరానికి విచ్చేస్తున్న కమిషన్‌ను మర్యాద పూర్వకంగా కలిసేందుకు దళిత సంఘాలు, మాల సంఘాలు సిద్ధమవుతున్నాయని అన్నారు. ఈ క్రమంలో కమిషన్‌ను కలిసేందుకు సోదర వర్గం వస్తున్నారని తెలిసిందని, తెలంగాణ రాష్ట్రానికి చెందిన వ్యక్తికి సంబంధంలేకున్నా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు వస్తున్నారని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. సోదర వర్గాన్ని నిలుపుదల చేసి, శాంతి భద్రతలను కాపాడాలని ఆయనకు విన్నవించారు. జిల్లా ఎస్పీని కలసిన వారిలో కమిటి సభ్యులు కనకవల్లి వినయ్, నల్లపు నీలాంబరం, బత్తుల అనిల్, చుక్క దేవరాజ్, దారా ప్రసాద్, పిల్లి రాజు, మంచాల జోసఫ్ ఉన్నారు.

అవోపా ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు



ఆధ్యాత్మికవేత్త కోటేశ్వరరావును సత్కరిస్తున్న అవోపా ప్రతినిధులు



ముందస్తు సంక్రాంతి సంబరాల్లో మహిళల

గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరువారితోటలోని రాధాకృష్ణ గోశాలలో వందో వారం గోపూజ, ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కేవీ కోటేశ్వరరావు మాట్లాడుతూ సలక దేవతా స్వరూపమైన గోమాతను పూజించడం మంచిదని చెప్పారు. అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గోసేవ, గోపూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అదే విధంగా భక్తిగీతాలకు కోలాట ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. పాలతో పొంగలి వండి, భోగి మంటలు వేసి, హరిదాసుల కీర్తనలతో సంక్రాంతి శోభను తెచ్చారు. గోవులను పరిశుభ్రం చేసి, పసుపు, కుంకుమలతో అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు తిరుప్పావై గోష్టి నిర్వహించారు. కార్యక్రమంలో అవోపా రాష్ట్ర కార్యదర్శి రాచపూడి సుబ్బారావు, నగర కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, గోపాల్‌రావు, చామర్తి రమేష్, కుర్నాల హరి వెంకట సతీష్, మద్ది సాయిరమేష్, 300 మంది సభ్యులు పాల్గొన్నారు.

నేడు విజయవాడ ధర్నా చౌక్ వద్ద పోరు దీక్ష



పోరు దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాసర్ జీ

లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీ మేరకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించడంలో అలసత్వం వహిస్తున్నదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ అన్నారు. కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో పోరు దీక్ష పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు.ఆయన మాట్లాడుతూ సోమవారం విజయవాడ నగరంలో ధర్నా చౌక్‌లో నిర్వహించనున్న పోరు దీక్షకు విద్యార్థి లోకం తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే విద్యా సంవత్సరం పూర్తి చేసుకుని, ఫీజులు చెల్లించలేక కళాశాలల్లోనే సర్టిఫికెట్లు ఉంచి ఉన్నత విద్య చదవలేక, మరో పనికి వెళ్లలేక, తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారని తెలిపారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ వలి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి ప్రణీత్, అధ్యక్షులు నగర సాయి, ప్రతిపాడు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు అమర్నాథ, డేవిడ్, అజయ్, కిరణ్, అలెక్స్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

గుంటూరు మెడికల్: ఏపీ మర్కజ్ మసీద్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పొత్తూరు వారి తోటలో వాసన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి శిబిరం నిర్వహించారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. మర్కస్ మసీద్ వైస్ ప్రెసిడెంట్ అహ్మద్ ఖాన్ తమ సంస్థ చేస్తున్న సేవల గురించి ఎమ్మెల్యేకు వివరించారు. వైద్యశిబిరంలో మొత్తం 202 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అందులో 31 మందికి శుక్లాలు, 9 మందికి పొరలు ఉన్నట్లు గుర్తించారని పీఆర్‌ఓ వెంకట్రావు తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవలో కంటి సమస్యలున్నవారికి వాసన్ ఐ కేర్ హాస్పిటల్‌లో ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని వెల్లడించారు.